# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలు పని చేయాలని భారత ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు.**
2. **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ ప్రారంభమైందని ఈ నెల 6వ తేదీ వరకు లబ్దిదారులకు పింఛన్ అందేలా జిల్లా కలెక్టర్లు ఏర్పాట్లు చేశారని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది.**
3. **వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర తిరుపతి జిల్లాలో కొనసాగుతోంది.**
4. **ఎండల తీవ్రత దృష్ట్యా తెలంగాణలో తాగునీటి సరఫరా పర్యవేక్షణకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.**
5. **దేశవ్యాప్తంగా ఉమ్మడి ప్రవేశ పరీక్ష –జేఈఈ మెయిన్ రెండో విడత పరీక్షలు ఈరోజు నుంచి జరగనున్నాయి.**

==========================

త్వరలో జరగనున్న లోక్ సభ, శాసన సభ ఎన్నికలు స్వేచ్ఛగా శాంతి యుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పని చేయాలని భారత ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శాంతి భద్రతలు, భద్రతా బలగాల ఏర్పాటు, ఎన్నికల వ్యయ నిర్వహణ ,నోడలు అధికారుల నియామకం, సరిహద్దు, సున్నితమైన అంశాలపై నిన్న ఢిల్లీ నుండి సిఇసి రాజీవ్ కుమార్ వివిధ రాష్ట్రాల ఉన్నతాధికారులతో దృశ్యమాధ్యమం ద్వారా సమీక్షించారు.

కాగా ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి, పోలీస్ డైరెక్టర్ జనరల్ కెవి.రాజేంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో ఐదు రాష్ట్రాలు అంతర్ రాష్ట్ర సరిహద్దులను కలిగి ఉన్నాయని,రాష్ట్ర సరిహద్దుల్లో 150 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న 91 పోలింగ్ కేంద్రాలను గుర్తించి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ ప్రారంభమైందని ఈ నెల 6వ తేదీ వరకు లబ్దిదారులకు పింఛన్ అందేలా జిల్లా కలెక్టర్లు ఏర్పాట్లు చేశారని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ స్పష్టం చేసారు. అనారోగ్య సమస్యలు ఉన్న,వృద్ధులు, వికలాంగులు వంటి వారు సచివాలయాలకు రాకుండా నిబంధనలను సవరించడం జరిగిందని, ఈ విభాగాల లబ్దిదారులు సచివాలయాలకు రానవసరం లేకుండా ఇంటి వద్దే పింఛన్ అందజేస్తారని అందుకు సంబంధించి కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్లను కోరామని శశి భూషణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

---------------------------

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర తిరుపతి జిల్లాకి చేరుకుంది. నిన్న బస చేసిన గురవరాజుపల్లె ప్రాంతం నుంచి ఈరోజు బయలుదేరి మల్లవరం, ఏర్పేడు, పనగల్లు, శ్రీకాళహస్తి బైపాస్ మీదుగా చిన్న సింగమల సమీపానికి చేరుకుంటారు.అక్కడ లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లతో ముఖాముఖిలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం నాయుడుపేట సమీపంలోని చెన్నై జాతీయ రహదారి వద్ద జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సభ అనంతరం ఓజిలి క్రాస్, బుదనం, గూడూరు బైపాస్, మనుబోలు, నెల్లూరు బైపాస్ మీదుగా చింతారెడ్డిపాలెం వద్ద రాత్రి బస చేస్తారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం పేర్కొన్నారు.

---------------------------

ఐపీఎల్ మ్యాచ్ ల్లో భాగంగా ఈరోజు అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. కాగా నిన్న విశాఖపట్నం వేదికగా ఢిల్లీ కాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 106 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్ రైడర్స్ విజయం సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్ 17. ఓవర్లలో 166 పరుగులు చేయగా టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న కోల్‌కతా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది.

---------------------------

ఎండల తీవ్రత దృష్ట్యా తెలంగాణలో తాగునీటి సరఫరా పర్యవేక్షణకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలోని 33 జిల్లాలకు 10 మంది ఐఏఎస్‌లను నియమిస్తూ…ఈ మేరకు నిన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులను జారీ చేశారు. తెలంగాణలో తాగునీటి సరఫరా సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. జులై చివరి వరకు ఈ ప్రత్యేక అధికారులు సెలవులు పెట్టకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తెలంగాణలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పాటు ప్రస్తుత తీవ్ర ఉష్ణోగ్రతల నేపథ్యంలో జిల్లాల వారీగా త్రాగునీటి సమస్యలు రాకుండా నీటి వృథాను అరికట్టేందుకు ఐఏఎస్ అధికారులకు నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

దేశవ్యాప్తంగా ఉమ్మడి ప్రవేశ పరీక్ష –జేఈఈ మెయిన్ రెండో విడత పరీక్షలు ఈరోజు నుంచి జరగనున్నాయి. ఈ పరీక్షను నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టీఏ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే ఈనెల 5, 6, 8, 9, 12 తేదీల్లో జరిగే జేఈఈ మెయిన్ రెండో విడత పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ అడ్మిట్ కార్డులను jeemain.nta.ac.in వెబ్‌సైట్ నుంచి ఎప్పటికప్పుడు డౌన్‌లోడ్ చేసుకోవాలని అడ్మిట్ కార్డులో

ఉన్న సూచనలు పాటించాలని ఎన్‌టీఏ సూచించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి బిజెపి జనసేన కూటమికి అధికారమిస్తే సామాజిక పింఛన్లను పెంచుతామని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం నియోజకవర్గంలోని కొత్తపేటలో నిర్వహించిన ప్రజాగళం సభలో పాల్గొని మాట్లాడుతూ... వాలంటీర్లను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం హర్షణీయంకాదని అన్నారు. ఎన్డీయే అధికారంలోకి వస్తే వాలంటీర్లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఎల్‌నినో పరిస్థితులు జూన్ చివరి వరకు కొనసాగనున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలో ఈ రోజు నుంచి ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమలో తీవ్ర వడగాలులు వీయడంతో పాటు సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవనున్నట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైనే నమోదవుతాయని పేర్కొంది.

---------------------------

“అంతర్జాతీయ గనుల అవగాహనా దినోత్సవాన్ని” ఈరోజు జరుపుకుంటున్నాం. పలు దేశాల్లో సామజిక, ఆర్థిక అభివృద్ధికి, జనాభాకు గనులు, పేలుడు పదార్థాల అవశేషాలు తీవ్ర అవరోధం కలిగిస్తున్నాయి. ఇటువంటి తరుణంలో వీటి ప్రభావాన్ని ఎదుర్కొంటున్న దేశాల్లో ప్రమాదాలను నివారించి...జాతీయ గనుల రక్షణ చర్యలను సమర్థంగా రూపొందించి..అమలు చేసే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి “గనుల అవగాహనా దినోత్సవాన్ని” ప్రతి ఏటా ఏప్రిల్ 4వ తేదిన నిర్వహిస్తోంది. గనుల రక్షణ, ప్రజల ఆరోగ్యం, భద్రత చర్యలకు ఐక్యరాజ్యసమితి తన సహకారాన్ని అందిస్తోంది.

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా సైబర్ నేరాలను అరికట్టేందుకు 7 సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర సైబర్ భద్రతా బ్యూరో ఆధీనంలో వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, సిద్ధిపేట్, ఖమ్మం, రామగుండం కమీషనరేట్ల పరిధిలో వీటిని ఏర్పాటు చేశారు. రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఒక కేంద్రం పని చేస్తుంది. ఈ పోలీస్ స్టేషన్లకు డిసిపి హోదా అధికారి అధిపతిగా ఉంటారని ఈ సైబర్ పోలీస్ స్టేషన్లు తెలంగాణ వ్యాప్తంగా సైబర్ నేరాలను దర్యాప్తు చేసేందుకు సహకరిస్తాయని అధికారులు తెలిపారు.

---------------------------

తెలంగాణలో కళాశాల ప్రవేశాల షెడ్యూల్ విడుదల కాకముందే విద్యార్థుల నుండి అడ్మిషన్లు తీసుకుంటే ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్ బోర్డు సెక్రటరీ శ్రుతి ఓజా ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే విద్యా సంవత్సరానికి గాను కళాశాలలకు ఇంకా అనుబంధ గుర్తింపు ఇవ్వలేదని ముందే విద్యార్థుల తల్లిదండ్రులు అడ్మిషన్లు తీసుకోవద్దని సూచించారు. తెలంగాణ ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో

గుర్తింపు ఉన్న కళాశాలల జాబితా అందుబాటులో ఉంటుదని వాటి ప్రకారమే  అడ్మిషన్లు తీసుకోవాలని బోర్డు తెలిపింది. మరోవైపు  తెలంగాణలోని ఇంటర్మీడియెట్ కాలేజీలకు  మే 31వ తేదీ వరకు వేసవి సెలవులు ఉన్నాయని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలన్నీ సెలవులు అమలు చేయాలని ఆదేశించింది.  సెలవుల్లో తరగతులు నిర్వహించరాదని స్పష్టం చేసింది.

======================